## క్లుప్తంగా

### రామకోటి పుస్తకాలతో భద్రాచలం పయనం


బైక్‌పై పయనమైన శివ

సఖినేటిపల్లి: మోరికి చెందిన శ్రీరామ భక్తుడు ఏలూరి శివ స్థానిక భక్తులు రాసిన రామ కోటి పుస్తకాలను తీసుకుని శనివారం బైక్‌పై భద్రాచలం బయలుదేరాడు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామంలోని పలువురు భక్తులకు పూర్తి చేసిన రామకోటి పుస్తకాలను సేకరించి భద్రాచలం తీసుకువెళుతున్నాడు. వాటిని భద్రాచలం క్షేత్రంలో స్వామివారికి సమర్పించనున్నట్టు శివ చెప్పాడు.

### బాధితులకు సాయం


బాధితులకు సహాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మామిడికుదురు: మొగలికుదురు బడుగువారిపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బగుడు వెంకటరమణ కుటుంబానికి శనివారం పలువురు సహాయం అందించారు. రెడ్‌క్రాస్ సంస్థ తరఫున పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త జంపన బుజ్జిరాజు ద్వారా బరకం, వంట సామగ్రి, హైజెనిక్ కిట్, నిత్యావసరాలు అందించారు. ఏపీఎస్సీడబ్ల్యూఏ మండల శాఖ ప్రతినిధులు 25 కిలోల బియ్యం, దుస్తులు, వంట సామాగ్రి, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమాల్లో మండల శాఖ ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, సంఘం సభ్యులు బయ్యా మోహన్‌రావు, సాధనాల సత్యనారాయణ, జి. సుబ్బరాజు, తాడి శుభానంద్, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు బోనం రాజు, అల్లూరి మధురాజు, పంచదార చిన బాబు, రత్నప్రసాద్ పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు


పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

పి.గన్నవరం: మండల కేంద్రమైన పి.గన్నవరంలో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారులు కిరణ్, చైతన్య పశువులకు గాలికుంటు వ్యాధులకు టీకాలు వేశారు. మొత్తం 70 ఆవులు, గేదెలకు చికిత్స అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

### చేతి వృత్తులకు ప్రోత్సాహం


సభలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మామిడికుదురు: విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇచ్చి వారి ప్రావీణ్యత ఆధారంగా రూ.15 వేలు విలువైన పనిముట్లను అందించి వారిని ప్రోత్సహిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నా రు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు శనివారం మండల పరిధిలోని ఆదుర్రు, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో జరిగాయి. ఆయుష్మాన్ భారత్ కార్డును పేదలు వినియోగించుకుని రూ.5 లక్షల వైద్య సదుపాయాలు పొందే అవకాశం కేంద్రం కల్పించిందని పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాస్, అల్లు విజయలక్ష్మి, పార్టీ నేతలు మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, పసుపులేటి మహలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు, తాడి సుభాష్, కోటిపల్లి సాయిబాబు, కోటిపల్లి దుర్గ, కటికిరెడ్డి గంగాధరమ్ పాల్గొన్నారు.

### అన్నదాన పథకానికి విరాళం


దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఇంగువ మల్లికార్జున శర్మ, వెంకట పార్వతీ దంపతులు రూ.10,116 విరాళం అందించినట్టు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆలయ అర్చకులు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

# ఈ-క్రాప్‌తో లాభాలెన్నో..

- చురుగ్గా రబీ పంటల నమోదు
- వచ్చే నెల 15 వరకూ గడువు


సంధిపూడిలో ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటున్న రైతు

ఆలమూరు: రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తోంది. అందులో ఈ-క్రాప్ విధానం ఒకటి. ప్రస్తుతం ఈ రబీ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత కోసం రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదును చేపట్టారు. వరి సాగు ప్రారంభమైన నాటి నుంచి నిర్ణీత సమయంలో రైతులు తమ సాగు చేసే పొలాల్లో వ్యవసాయ క్షేత్ర సహాయకుల ద్వారా ఈ-క్రాప్ చేయించుకోవడంతో తమ ఉత్పత్తులను నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించనుంది. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ కియోస్కో మిషన్‌లో నిక్షిప్తమవడంతో సమయానికి ఎరువులు, పురుగు మందులు రాయితీ, పంటల బీమా, నాణ్యమైన విత్తనాలు అందే వీలు ఉంటుంది.

**ఈ-క్రాప్ నమోదు ఈజీ..**

రాష్ట్ర ప్రభుత్వం 2019లో రబీ సీజన్‌లో ఈ-క్రాప్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం(ఆర్‌బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతోపాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను రెవెన్యూ వెబ్ ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ పంట నమోదును చేస్తున్నారు. రైతు తన ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు 1బీ లేదా పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను రైతు భరోసా కేంద్రానికి తీసుకువెళ్లి ఈ-క్రాప్‌ను నమోదు చేసుకోవాలి. కౌలు రైతులైతే అదనంగా సీసీఆర్‌సీ కార్డును జత చేయాలి. ఈ-క్రాప్ నమోదులో జవాబు దారీతనంగా ఉండేందుకు రైతులకు రశీదులు సైతం అందజేస్తున్నారు.

**ప్రయోజనాలివే...**

వరి రైతులు, కౌలు రైతులందరూ వ్యవసాయశాఖ సూచనల మేరకు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటే అనేక లాభాలున్నాయి. వరిసాగు చేసిన రైతు ఈ-క్రాప్‌లో నమోదై ఉంటే ఆ సర్వే నంబరు భూమి వివరాలు సమగ్రంగా ఉంటాయి. రైతుకు అవసరమైన వ్యవసాయపరమైన సూచనలు, సలహాలు వ్యవసాయశాఖ అధికారులు అందజేస్తారు. దీంతో పాటు రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్న వడ్డీ రాయితీలు, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలు ఉంటుంది. ఈకేవైసీ ఆధారంగా జరిగే ఈ-క్రాప్‌ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

**వచ్చే నెల 15 నాటికి...**

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా 92.5 లక్షల మంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి వరి రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా తెలియజేసింది.

**పెరిగిన అవగాహన**



ఈ-క్రాప్ విధానంపై రైతులకు అవగాహన పెరిగింది. రైతులు స్వచ్ఛందంగా ఆర్‌బీకేలకు వచ్చి పంట నమోదు చేసుకుంటున్నారు. ఆర్‌బీకేల్లో అధికారులు సక్రమంగా బాధ్యతను నిర్వహించడం వల్ల రైతులకు తమ పంట ఉత్పత్తులపై భరోసా ఏర్పడింది.

– డి.దుర్గారావు, ఆర్‌బీకే క్షేత్రస్థాయి సహాయకులు, పెదపళ్ల

**ఈ-క్రాప్‌తో మేలు**



పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర, రాయితీలను అందించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-క్రాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ-క్రాప్ విధానంలో రైతులందరికి మేలు జరుగుతుంది.

–ఎస్.లక్ష్మి లావణ్య, ఏఓ, ఆలమూరు

### అప్పనపల్లికి భక్తుల తాకిడి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయం శనివారం గోవిందనామ స్మరణతో మార్మోగింది. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో స్వామి వారి ఆలయం కోలాహలంగా మారింది. భక్తులు వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. మొక్కులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.2.93 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.22 లక్షలు రాగా, నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.71,429 విరాళంగా సమర్పించారు. 5,861 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 3,950 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

### అయోధ్య అక్షతల పంపిణీ


నర్శిపూడిలో అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఆలమూరు: నర్శిపూడిలో శనివారం అయోధ్య శ్రీరామ అక్షతలను పంపిణీ చేశారు. అయోధ్య రామాలయంలో బాల రాముని ప్రతిష్ఠ మహోత్సవాలకు ఆహ్వానిస్తూ మండల బీజేపీ శాఖ అక్షతల పంపిణీ చేసేందుకు గ్రామంలో మండల బీజేపీ శాఖ పర్యటించింది. అందులో భాగంగా హరే శ్రీనివాస భజన బృందం రామభక్తుల సహకారంతో ఊరూర తిరుగుతూ అక్షతలు ప్రజలకు అందజేశారు. 22న బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు.

పి.గన్నవరం: స్థానిక మెయిన్‌రోడ్డులో పోతురాజు స్వామి ఆలయం వద్ద సత్యాంబికా ఫర్నిచర్ షోరూమ్‌లో భక్తులకు అక్షతలు పంపిణీ చేశారు.

**అక్షతలు పంపిణీ**

అయినవిల్లి: వీరవెల్లిపాలెంగ్రామంలో బీజేపీ పి.గన్నవరం నియోజవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అక్షతలను ప్రజలకు అందజేశారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా


చొప్పెల్లలో విజేతలను అభినందిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. అందులో భాగంగా క్రికెట్ ఫైనల్ పోటీలు శనివారం జరిగాయి. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపి.శెట్టి పర్యవేక్షణలో చొప్పెల్ల లేఅవుట్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో బడుగువానిలంక, మడికి-1 జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన మడికి-1 జట్టు విజేతగా నిలిచింది. క్రీడాకారులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అభినందించారు. సర్పంచ్‌లు, ఎంఈఓలు, పీఈటీలు తదితరులు విజేతలను అభినందించారు.

**క్రీడలతో యువతలో స్ఫూర్తి**

అయినవిల్లి: మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి వెంకటాచార్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువతలో స్ఫూర్తి నింపవచ్చునన్నారు. క్రీడలతో యువతకు మానసికోల్లాసం అలవడుతోందన్నారు. బాడ్మింటన్‌లో పురుషుల జట్టులో అయినవిల్లి-1, మహిళల జట్టులో విలస-1, కబడ్డీ పోటీల్లో పురుషుల జట్టులో నేదునూరు-2, మహిళల జట్టులో అయినవిల్లి-2, ఖోఖోలో పురుషుల జట్టులో వీరవల్లిపాలెం, మహిళల జట్టులో నేదునూరు-1, వాలిబాల్‌లో పురుషుల జట్టులో మాగం, మహిళల జట్టులో కె.జగన్నాథపురం, క్రికెట్‌లో పురుషుల జట్టులో వీరవల్లిపాలెం, మహిళల జట్టులో నేదునూరు-2 ఫైనల్‌లో నిలిచాయన్నారు. విజేతలకు ఈ నెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్థానిక ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి తదితరులు అభినందనలు తెలిపారు.

**ముగిసిన మండల స్థాయి ఫైనల్ పోటీలు**

రాజోలు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండల స్థాయి ఫైనల్ పోటీలు శనివారంతో ముగిశాయి. మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఈ నెల 24న నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. క్రికెట్ పోటీల్లో పొన్నమండ-2(పురుషులు), రాజోలు-1(మహిళలు) జట్లు, బ్యాడ్మింటన్ విజేతలుగా రాజోలు-2(పురుషులు), రాజోలు-1(మహిళలు), ఖోఖో విజేతలుగా పొన్నమండ-2(పురుషులు), కూనవరం(మహిళలు), కబాడ్డీ పోటీల్లో విజేతగా రాజోలు-2(పురుషులు), రాజోలు-1(మహిళలు), వాలీబాల్ విజేతలుగా పొన్నమండ-1(పురుషులు), కూనవరం(మహిళలు) జట్లు నిలిచాయి. ఫైనల్‌లో విజేతలుగా నిలిచిన జట్లు మలికిపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.


విజేతలను అభినందిస్తున్న ఎంపీడీఓ

**క్రికెట్ పోటీల్లో విజేతగా లూటుకుర్రు**

మామిడికుదురు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. పాశర్లపూడిలంక ఓఎన్‌జీసీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ పోటీల్లో పాశర్లపూడిలంకపై లూటుకుర్రు జట్టు విజయం సాధించిందని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. బాలుర కబడ్డీలో కరవాక, వాలీబాల్‌లో పాశర్లపూడిలంక, కోకోలో పెదపట్నం, షటిల్ బాడ్మింటన్‌లో మొగలికుదురు జట్లు విజయం సాధించాయి. బాలికల కబడ్డీలో గెద్దాడ, షటిల్ బాడ్మింటన్‌లో పెదపట్నంలంక విజయం సాధించాయి. విజేతలకు జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు బహుమతులు అందజేశారు.

### వెంకన్న ఆలయాల్లో పూజలు

ఆలమూరు: మండలంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్య భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో ఉన్న అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. వేదపండితుల స్వామి తులసీ పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

# సాగునీటి సమస్యపై రైతుల ఆందోళన


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మామిడికుదురు: ఈదరాడ కాలువ శివారు ప్రాంతమైన ఆదుర్రు గ్రామానికి సాగునీరు అందడం లేదంటూ స్థానిక రైతులు శనివారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆదుర్రులో సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. నేటి వరకూ ఆదుర్రు గ్రామానికి సాగునీరు రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. ప్రతి రోజు ఈదరాడ డ్యామ్‌ను రైతులు మూసేయడం వల్ల కాలువ దిగువకు సాగునీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు దిగువకు వస్తున్న కొద్ది పాటి నీటిని కొమరాడ, గుడ్లగుమ్మి చెరువు ప్రాంతాల్లో రైతులు ఇంజిన్ల ద్వారా కొబ్బరి తోటలకు తోడేస్తున్నారని ఆరోపించారు. కాలువ పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని, పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరు అందించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శరణ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ ఆందోళనలో సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, వి.సత్యనారాయణగుప్తా, విజ్జపు గోపాలకృష్ణ, ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం, కె.వీరంశెట్టి పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- సబ్‌స్టేషన్‌కు రూ.11.23 కోట్ల మంజూరు
- జెడ్పీటీసీ అంజిబాబు, ఎంపీపీ వనజకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అంజిబాబు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ప్రస్తుతం ఉన్న మగటపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సామర్థ్యం అయిదు మెగావాట్లకు అదనంగా ఏర్పాటుకు రూ.11.23 కోట్లు నిధులు మంజూరయ్యాయని నగరం సబ్ స్టేషన్ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. పాశర్లపూడిబాడవ సత్తరువుతోటలో స్థానికులు తమ సొంత భూముల్లోని 16 కొబ్బరి చెట్లను స్వచ్ఛందంగా తొలగించి నెలరోజులు కావస్తున్నా అక్కడ నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ఏడు కరెంటు స్తంభాలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడం దారుణమని ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని జెడ్పీటీసీ అంజిబాబు హామీ ఇచ్చారు. సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమస్యను ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు వాపోయారు. సమావేశాలకు రాని అధికారులుపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, ఏఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య


విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ ప్రసన్న కుమారి

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సాంకేతిక విద్య అందుబాటు లోనికి తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని మలికిపురం జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి పేర్కొన్నారు. రామరాజులంక గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మంజూరైన ట్యాబ్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత కూడా జగన్‌దేనని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, హెచ్ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతూ ఎంపీడీఓ జాన్‌లింకన్

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీల అభివృద్ధి (2024-25) ప్రణాళికలపై రెండు రోజుల అవగాహన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ పంచాయతీల అభివృదిక్ది ప్రణాళికలను రూపొందించడం ద్వారా గ్రామ పంచాయతీలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేందుకు దోహదపడుతుందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను ఎంపీడీఓ జాన్‌లింకన్ వివరించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు. గ్రామ సచివాలయ సిబ్బంది లేవనెత్తిన సందేహాలను ఎంపీడీఓ జాన్‌లింకన్ నివృత్తి చేశారు.

### అభిమానులకు కృతజ్ఞతలు

పి.గన్నవరం: విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పి.గన్నవరం నియోజకవర్గం నుంచి తరలివెళ్లిన పార్టీ శ్రేణులకు, అంబేడ్కర్ అభిమానులకు పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి వెళ్లారని ఆయన వివరించారు.

# 108లో ప్రసవం


తల్లీ బిడ్డతో అంబులెన్స్ సిబ్బంది

మామిడికుదురు: మగటపల్లికి చెందిన గర్భిణి మిరప ప్రశాంతికి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 108 కాల్ చేశారు. మామిడికుదురు 108 వాహన సిబ్బంది హుటాహుటిన మగటపల్లి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించే క్రమంలో నొప్పులు తీవ్రం కావడంతో మార్గమధ్యంలోనే ప్రసవం చేశారు. ప్రశాంతి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు 108 సిబ్బంది జీపీ దాసు, ఎం.మోహన్ తెలిపారు.

# కళాశాల అభివృద్ధికి సాయం


సాయం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: స్థానిక మహత్మాగాంధీ కళాశాల పూర్వ విద్యార్థి, ఆత్రేయపురం గ్రామానికి చెందిన యాతం సంతోష్ కళాశాల అభివృద్ధికి రూ.40 వేలు అందించారు. ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటూ తెలుగు అసోసియేషన్ సభ్యుడిగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను చదువుకున్న కళాశాలకు ఆర్థిక సహాయాన్ని తన కుటుంబ సభ్యుల ద్వారా కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా పీఎస్ రాజు మాట్లాడుతూ సంతోష్‌ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజ సేవకు తోడ్పాలన్నారు. సంతోష్ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, సూర్యనాగమణి, డాక్టర్ బాలాజీ సురేష్, రేవతిని ఆయనతో పాటు ప్రిన్సిపాల్ బీవీఆర్ అభినందించారు.

### లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ప్రమీలారాణి

రాజోలు: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందుతుందని రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో లోక్‌అదాలత్ నిర్వహించారు. కక్షిదారులు ఇరువురికి పరిష్కార మార్గం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యుడు ఎల్.వి.ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: మండలంలో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.మల్లికార్జున్, డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు-1. ఆలమూరు-2, పెనికేరు, పినపళ్ల, కలవచర్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం, గుమ్మిలేరు తదితర గ్రామాల్లో చిన్నారులకు ఆరోగ్య, ఆశ సిబ్బంది టీకాలను వేశారు. వీటివల్ల చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డయేరియా, కోరింత దగ్గు రాకుండా ఉంటాయి.